సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం, 29, సెప్టెంబర్, 2023



హార్ట్ భద్రం..!
కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత హార్ట్ ఎటాక్ కేసులు రెట్టింపు అయ్యాయి.

వివరాలు 8లో ▸



మొరాయిస్తున్న సర్వర్లు
డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ సమస్య తలెత్తుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /21.2

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో.. మిలాదున్నబీ వేడుకలు



కందనూలు: జిల్లా కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. గురువారం జామియా మసీద్‌లో మిలాద్‌- ఉన్‌- నబీ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా నిజామీయా హైదరాబాద్‌కు చెందిన ఆలిం మౌలానా మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ నక్షే బంది ఆధ్యాత్మిక ప్రసంగాన్ని అందించారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన బోధనలు అనుసరిస్తే అల్లా కృపకు పాత్రులు అవుతామన్నారు. ఇస్లాం మతం పవిత్రమైందని, అల్లా మన కోసం అన్నీ ఇచ్చాడని, అల్లా కోసం మనం ప్రవక్త సూచించిన దారిలో నడుస్తూ మానవజన్మను సఫలీకృతం చేసుకోవాలన్నారు. దీంతో పాటు మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. అనంతరం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జాగరణ మహోత్సవం ముగిసింది. గురువారం ఉదయం మహమ్మద్ ప్రవక్తకు చెందిన వస్తువులు, ఆసార్ ఏ ముబారక్ ప్రదర్శనకు ఉంచారు. మసీద్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు శోభాయాత్ర

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నట్టు మసీద్ కమిటీ అధ్యక్షుడు జైనుల్లాబుద్దీన్ తెలిపారు. నమాజ్ అనంతరం జామా మసీద్ నుంచి పట్టణ పురవీధుల వెంట ఈ శోభాయాత్ర వెళ్లి కాంప్లెక్స్ పై జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ముగిస్తాయని తెలియజేశారు.

నేడు గ్రామీణ ప్రాంతాలకు బస్సులు బంద్

కందనూలు: వనపర్తి పట్టణంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం 50 బస్సులు వెళ్తుండటంతో నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు బస్సులను నిలిపివేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 బస్సులను హైదరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, పట్టణాలకు మాత్రమే నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

'108'లో దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ క్రైం: ఈఎంఆర్ఐ(108)లో డిస్ట్రిక్ మేనేజర్, హాస్పిటల్ కోఆర్డినేటర్‌గా పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని నాగర్‌కర్నూల్ ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని 108 ఆఫీసులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. హాస్పిటల్ కోఆర్డినేటర్ పోస్టుకు సంబంధించి బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, ఎంపీహెచ్ డబ్ల్యూ అర్హత ఉండాలని, డిస్ట్రిక్ మేనేజర్ పోస్టుకు సంబంధించి బీటెక్ ఇంజినీరింగ్ పాసై ఉండాలని వివరించారు.

మిల్లర్ల ఇష్టారాజ్యం

బియ్యం పక్కదారి పడుతున్నా పట్టించుకోని అధికారులు



కొల్లాపూర్‌లోని ఓ రైస్‌మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

- వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎమ్మార్ 40 శాతం కూడా అందని వైనం
- ఇప్పటివరకు ప్రభుత్వానికి ఇచ్చింది 20 వేల మెట్రిక్ టన్నులే..
- జిల్లా వ్యాప్తంగా 109 రైస్‌మిల్లులు
- బఫర్ స్టాక్ పేరుతో మాయాజాలం



కల్వకుర్తి మండలంలోని రైస్‌మిల్లులో తనిఖీలు చేపడుతున్న అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని రైస్‌మిల్లర్ల తీరు ఇష్టారాజ్యంగా కన్పిస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని బియ్యంగా మలిచి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ తీవ్ర జాప్యం కొనసాగుతోంది. మిల్లుల సీఎమ్మార్ అప్పగింతకు ప్రభుత్వం పలు మార్లు గడువు పెంచినా చాలావరకు మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సీఎమ్మార్ అప్పగించని మిల్లర్లపై అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో రైస్‌మిల్లర్ల దందా జోరుగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్యం 92 వేల మెట్రిక్ టన్నులు

వానాకాలం సీజన్ 2022–23కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 109 రైస్‌మిల్లులకు ప్రభుత్వం సీఎమ్మార్ కింద ధాన్యాన్ని అప్పగించింది. వీటి నుంచి మొత్తం 92,897 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ప్రభుత్వానికి అప్పగించింది కేవలం 20,154 మెట్రిక్ టన్నులు మాత్రమే. ఇంకా 72,743 మెట్రిక్ టన్నులు జిల్లాలోని మిల్లుల నుంచి రావాల్సి ఉంది. యాసంగికి సంబంధించి మొత్తం 1,08,700 మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ప్రభుత్వానికి చేరింది కేవలం 10,034 మెట్రిక్ టన్నులు మాత్రమే. సీఎమ్మార్ బియ్యం విషయంలో జాప్యం చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రభుత్వానికి రీసైక్లింగ్ బియ్యం..

ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా మలచి సీఎమ్మార్ కింద తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు గడువు పొడిగింపు తర్వాత ప్రభుత్వానికి రీసైక్లింగ్ బియ్యాన్ని అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని పలు రైస్‌మిల్లుల్లో ఇటీవల పౌరసరఫరా అధికారుల తనిఖీల్లో రేషన్‌బియ్యాన్ని నిల్వచేసినట్టు నిర్ధారణ అయినా సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. తనిఖీల సమయంలో మిల్లర్లు తమ కాగితాల్లో మాత్రం బియ్యం ఉన్నట్టుగా చూపుతూ.. గోదాంల్లో ఇతర ప్రాంతాల్లో నిల్వ చేశామని చెప్తూ అధికారులను మేనేజ్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారుల ప్రోత్సాహంతోనే ఈ దందా సాగుతోందనే ఆరోపణలున్నాయి.

జరిమానా విధిస్తున్నాం..

ప్రభుత్వం విధించిన గడువులోగా సీఎమ్మార్ కింద బియ్యం అప్పగించని మిల్లులపై అదనంగా 25 శాతం బియ్యాన్ని పెనాల్టీగా విధిస్తున్నాం. సీఎమ్మార్ బియ్యం అప్పగింతలో జాప్యాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాం.
– బాలరాజు, డీఎం, పౌరసరఫరాశాఖ

2022-23 వానాకాలం సీజన్‌లో సీఎమ్మార్ వివరాలు..
జిల్లాలో సీఎమ్మార్ లక్ష్యం 92,897 మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు ప్రభుత్వానికి అప్పగించింది 20,154 మెట్రిక్ టన్నులు
ఇంకా రావాల్సింది 72,743 మెట్రిక్ టన్నులు

2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన వివరాలు..
జిల్లా వ్యాప్తంగా సీఎమ్మార్ లక్ష్యం 1,08,700 మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు ప్రభుత్వానికి అప్పగించింది 10,034 మెట్రిక్ టన్నులు
ఇంకా రావాల్సింది 98,666 మెట్రిక్ టన్నులు

అసమ్మతి హోరు..

- కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీ పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి నేతలు
- వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు



జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ నేతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో లుకలుకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తమ కష్టాన్ని గుర్తించడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు సీనియర్ నేతలు గళం విప్పుతున్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం సాగుతుండగా.. కల్వకుర్తి నియోజకవర్గంలో సీనియర్ నేత, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ సైతం గులాబీని వీడేందుకు మొగ్గు చూపుతున్నారు. తాజాగా జిల్లాలో రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఠాకూర్ సైతం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై అసమ్మతి గళమెత్తడంతో ఆ పార్టీలో ఏం జరుగుతుందన్న దానిపై సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

బాలాజీ సింగ్ వద్దకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్..

కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే టికెట్టు ఆశించారు. అయితే పార్టీ అధిష్టానం ఈసారి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కే టికెట్టు ఇస్తున్నట్టు ప్రకటించడంతో పార్టీలో అసమ్మతి రాగం ఊపందుకుంది. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం సాగుతోంది. అలాగే మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్ సైతం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు టికెట్టు కేటాయించడాన్ని తప్పుబడుతున్నారు. చిత్తరంజన్‌దాస్‌ను ఇటీవల బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తీరుపై అసంతృప్తిగా ఉన్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ ఠాకూర్‌తో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హైదరాబాద్‌లో గురువారం భేటీ అయ్యారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల వెంకటేశ్‌గుప్తా ఉన్నారు. ఈ క్రమంలో తన గెలుపు కోసం వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. బాలాజీ సింగ్ తిరస్కరించినట్టు తెలిసింది. తన భవిష్యత్‌పై పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన సమాచారం అందిన తర్వాతే నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్టు తెలిసింది. సుమారు రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నా ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని, అన్ని విషయాల్లోనూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బాలాజీ సింగ్ చెబుతున్నారు. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ నియోజకవర్గంలోని గులాబీ నేతల్లో అసంతృప్తి జ్వాలలు బయటపడుతుండటం పార్టీ క్యాడర్‌లో ఆందోళన కలిగిస్తోంది.

ఫీడర్ చానల్ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్ల గ్రామ సమీపంలోని వీరమనాయిని చెరువుకు సింగోటం రిజర్వాయర్ నుంచి సాగునీరు రావడానికి ఏర్పాటు చేస్తున్న ఫీడర్ చానల్ కాల్వ నిర్మాణానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గురువారం చెరువు వద్ద భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల చిరకాల వాంఛ త్వరలో నెరవేరుతుందన్నారు. చానల్ నిర్మాణానికి రూ.1.04 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. నెల రోజుల్లో కాల్వ పనులు పూర్తిచేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కాల్వ నిర్మాణానికి జవాయిపల్లి గ్రామ ప్రజలు కూడా సహకరించాలన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల బహిరంగ సభలో చెప్పిన విధంగా సాగునీటికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేయడానికి పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, ఎంపీటీసీ సభ్యులు రజిత, సర్పంచ్ నాగరాజు, రంగస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు తండాల్లో కరెంటు లేకుంటే వింత

ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: ఒకప్పుడు గిరిజన తండాలు చిమ్మచీకట్లో ఉండేవి, రాష్ట్ర అవతరణ తర్వాత అదే తండాల్లో కరెంటు వెలుగులు విరజిమ్మే పరిస్థితి తెచ్చామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గతంలో తండాల్లో కరెంటు ఉంటే వింత అని, ఇప్పుడు కరెంటు పోతే వింత అనే పరిస్థితికి వచ్చామన్నారు. పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రి పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా తిమ్మాజీపేట మండలంలోని ఆయా గిరిజన తండాల్లో పాదయాత్ర చేపట్టి పలు ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తండాల్లో సారా బంద్ చేయించి వారికి స్వయం ఉపాధి కల్పించామని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి తండాలదే పెత్తనంగా మార్చామన్నారు. గతంలో తండాలకు రోడ్లు ఉండేవి కావని, ప్రస్తుతం ప్రతి తండాకు బీటీ రోడ్డు వచ్చిందన్నారు. డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, తిమ్మాజీపేట బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు పాల్గొన్నారు.

బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్‌మిల్లుకు శంకుస్థాపన

- అక్టోబర్ 3న ముహూర్తం ఖరారు
- రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆయిల్‌పాం క్రషర్ మిషన్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,400 మందికి ఉపాధి
- రూ.150 కోట్లతో పునర్నిర్మాణ పనులు

నెరవేరనున్న.. దశాబ్దాల కల



ఇటిక్యాల మండలం బీచుపల్లిలోని విజయవర్ధిని మిల్లు ముఖద్వారం

అలంపూర్: దశాబ్దాల క్రితం మూతపడిన విజయవర్ధిని ఆయిల్‌మిల్లుకు పూర్వవైభవం రానుంది. ఎట్టకేలకు టీఎస్‌ఆయిల్ ఫెడరేషన్ ఆయిల్‌పాం క్రషింగ్ మిల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం వచ్చే నెల 3న ముహూర్తం ఖరారు చేశారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.150 కోట్ల వ్యయంతో ఇటిక్యాల మండలం బీచుపల్లిలో ఉన్న టీఎస్ ఫెడరేషన్ (విజయవర్ధిని) ఆయిల్ మిల్లును పునరుద్ధించనున్నారు. ప్రస్తుతం ఉన్న మిల్లులోనే ఆయిల్‌పాం గెలల బాయిలింగ్, కాయలు వేరు చేయడం, క్రషింగ్, క్రూడాయిల్ పీచు వేరు చేయడం వంటి వివిధ దశలకు సంబంధించిన యూనిట్లు నిర్మించనున్నారు. ఏడాదిన్నరలో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు వచ్చేనెల 3న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

రాష్ట్రంలో మూడు క్రషింగ్ యూనిట్స్

రాష్ట్రంలో ఆయిల్ కొరత నివారణకు ప్రభుత్వం ఆయిల్‌పాం తోటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఆయిల్‌పాం ద్వారా పామాయిల్ తయారీకి అనువుగా కొత్తగా ఆయిల్ క్రషింగ్ యూనిట్స్ నిర్మిస్తుంది. రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, అప్పారావుపేటలో రెండు యూనిట్స్ ఉన్నాయి. వాటికి తోడుగా కొత్తగా సిద్ధిపేట, మహబూబాబాద్‌తోపాటు జిల్లాలోని ఇటిక్యాల మండలం బీచుపల్లిలో ఉన్న విజయవర్ధిని ఆయిల్‌మిల్‌ను పునరుద్ధరిస్తోంది.

ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ పరిధిలో..

రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఆయిల్‌పాం సాగు జరిగే విధంగా చర్యలు చేపడుతుంది. వీటిలో 7 జిల్లాలు ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ పరిధిలో సాగును ప్రోత్సహించి క్రషింగ్ మిల్లులను నిర్మిస్తోంది. జోగుళాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, జనగాం, నారాయణపేట జిల్లాలు ఉన్నాయి. ఆయిల్‌పాం క్రషింగ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ సంస్థ పరిధిలో కొనసాగనుండగా.. మిగిలినది ప్రైవేటు కంపెనీల ద్వారా నిర్వహించనున్నారు. భవిష్యత్‌లో 20 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.


10 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాతోపాటు నారాయణపేటలో ఆయిల్‌పాం సాగు అంతకంతకూ పెరిగింది. రెండు జిల్లాలకు అనువుగా బీచుపల్లిలో క్రషింగ్ ప్రారంభం కానుంది. ఈ యూనిట్‌లో గంటకు 30 టన్నులు (ఒక రోజుకు 600 టన్నులు) పామాయిల్ గెలలను వేరు చేసి క్రషింగ్ చేయనున్నారు. రెండు జిల్లాల్లో కలిపి ప్రస్తుతం 10 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. మరో ఏడాదిన్నరలో 25 వేల ఎకరాలకు పెంచడానికి వీలుగా సాగు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఆయిల్ మిల్లు రాకతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరగనున్నాయి. నిర్మాణం పూర్తయ్యాక ప్రత్యక్షంగా 400 మంది, పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం..

టీఎస్ ఆయిల్ ఫెడరేషన్ (విజయవర్ధిని) మిల్లుకు వచ్చే నెల 3న శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రోజుకు 600 టన్నుల క్రషింగ్ చేసే సామర్థ్యంతో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ సంస్థ నిర్మించనుంది. ఏడాదిన్నరలో నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నాం.
– వెంకటేష్, టీఎస్‌ఫెడరేషన్, డిప్యూటీ మేనేజర్

1990 నిర్మాణం.. 2003లో మూత



విజయవర్ధిని ఆయిల్ మిల్లులోని గోదాంలు

1990లో బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ మిల్లును దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించారు. నూనె గింజల సహకార సంఘాలు, నూనె గింజల పంటలో స్వయం సమృద్ధి సాధించడం లక్ష్యంగా ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి బీజం పడింది. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ సహకారంతో 200 టన్నుల సామర్థ్యం గల నూనె మిల్లు, 100 టన్నుల సామర్థ్యం గల సాల్వెంట్ ఆయిల్, 100 టన్నుల సామర్థ్యం గల రిఫైనరీ ప్లాంట్ ఏర్పాటు చేశారు. గద్వాల, వనపర్తి, అలంపూర్, ఆత్మకూరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో నూనె గింజలను సేకరించి రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో దీన్ని నిర్మించారు. ప్రభుత్వం బీచుపల్లి వద్ద విజయబ్రాండ్ ఆయిల్ మిల్లును ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసింది. దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో వేరుశనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు, విజయ బ్రాండ్ నూనెలను ఉత్పత్తి చేసి వచ్చే ఆదాయంలో రైతులకు వాటా ఇచ్చే లక్ష్యంతో నిర్మించింది. కొన్నేళ్లు విజయవంతంగా కొనసాగినా.. 2003లో మూతబడింది. నూనె, ఇతర పదార్థాల అమ్మకాల్లో అధికారుల చేతివాటం, అక్రమాలతో అప్పుల ఊబిలోకి వెళ్లి మూతపడింది.

నిధుల వరద

- అభివృద్ధి పనులకు భారీగా కేటాయింపు
- ఆలయాలతో పాటు కుల సంఘాలకు..
- రెండు నెలల్లో రూ.259.5 కోట్లు మంజూరు
- ఎన్నికల వేళ పట్టాలెక్కుతున్న అభివృద్ధి



ఎస్‌డీఎఫ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దూకుడు పెంచారు. ప్రభుత్వం నియోజకవర్గానికి భారీ ఎత్తున నిధులు విడుదల చేయడంతో అభివృద్ధి పనులు పరుగులు తీసేలా ప్రణాళిక రూపొందించారు. సీఎం కేసీఆర్‌ను పలు మార్లు కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరడంతో నిధుల వరద మొదలైంది. నెల రోజుల వ్యవధిలోనే అచ్చంపేట నియోజకవర్గానికి రూ.259.5కోట్ల నిధులు మంజూరు చేశారు. మొదట జీఓ 370 ఎఫ్‌డీఎఫ్ కింద రూ.100 కోట్లు, తర్వాత రూ.30.15కోట్లు, రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా అభివృద్ధికి రూ.50 లక్షలు, ఎస్టీ ఎస్‌డీఎఫ్ బీటీ రోడ్లకు రూ.79 కోట్లు, బీటీ రోడ్లకు రూ.35 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.80 కోట్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఈ నిధులు విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. కుల సంఘాలపై ఫోకస్ చేసి భారీ ఎత్తున నిధులు కేటాయించి తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

పట్టణాభివృద్ధికి రూ.40 కోట్లు

అచ్చంపేట మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా అంతర్గత రోడ్లతో పాటు డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం ఎస్‌డీఎఫ్, టీడీఎఫ్‌సీ నుంచి రూ.40 కోట్లు మంజూరయ్యాయి. ఎస్‌డీఎఫ్ కింద ఇప్పటికే రూ.10 కోట్లు విడుదల కాగా.. పనులు ప్రారంభమయ్యాయి. మరో రూ.10 కోట్ల ప్రతిపాదనలు పంపించారు. టీడీఎఫ్‌సీ నుంచి రూ.20 కోట్ల నిధులు రాగా.. ఎన్టీఆర్ మినీ స్టేడియం అభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.60కోట్లు

నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నుంచి రూ.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో అచ్చంపేట అయ్యప్ప ఆలయానికి రూ.కోటి, సేవాలాల్ ఆలయానికి రూ.కోటి, మైనారిటీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి రూ.2 కోట్లు, గిరిజన సంఘం రూ.కోటి, యాదవ సంఘానికి రూ.కోటి, చెంచు సంఘానికికు రూ.50 లక్షలు, ముదిరాజ్ భవన్‌కు రూ.70 లక్షల చొప్పున ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో 200 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యారు. దీంతో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాలు పునర్నిర్మాణానికి, అభివృద్ధికి నోచుకుంటాయని భావిస్తున్నారు.

అంతటా అదే చర్చ..

బీఆర్ఎస్ పార్టీ గత నెల 21న అభ్యర్థుల జాబితా ప్రకటించింది. అచ్చంపేట నుంచి గువ్వల బాలరాజు పోటీ చేస్తారని ప్రకటన వెలువడిన తర్వాత నియోజకవర్గానికి నిధుల వరద పారుతుండటంతో అంతటా ఇదే అంశంపై చర్చ జరుగుతుంది. రెండు నెలల వ్యవధిలో రూ.259.5 కోట్ల నిధులు మంజూరవడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు మరిన్ని నిధులు మంజూరవుతాయని భావిస్తున్నారు. ప్రధానంగా సాగునీటికి సంబంధించి అచ్చంపేట లిఫ్ట్ ఫేస్–2 పనులకు టెండర్ వచ్చే అవకాశం ఉంది.

కులసంఘాలకు రూ.30 కోట్లు..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో కుల సంఘ భవనాలు, ఆలయాల అభివృద్ధికి తొలుత ఎస్‌డీఎఫ్ నుంచి రూ.20 కోట్లు మంజూరయ్యారు. తర్వాత మరో రూ.10 కోట్లు మంజూరు చేశారు. రూ.30కోట్లతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో కుల సంఘాలకు ప్రొసీడింగ్స్‌ను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చేతల మీదుగా అందజేశారు.

సమయం వృథా కానివ్వొద్దు..

ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపనలు చేస్తున్నాం. రోజుకు ఐదు కార్యక్రమాలు చేపట్టినా.. సమయం సరిపోదు. ఒక్క క్షణం వృథా కాకుండా పనిచేస్తున్నాం. ప్రతి కార్యక్రమంలో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తున్నాం.
– గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే

క్లుప్తంగా

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి కిందపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో పుట్ట వెంకటస్వామి (55) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి నీటితో క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ఢీకొని చిన్నారి..


మమత (ఫైల్)

దామరగిద్ద: బైక్ ఢీకొని చిన్నారి మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన అనసూయ, శివారెడ్డిల కుమార్తె మమత (11) రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం భర్త ఆత్మహత్య చేసుకోగా, కూతురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. మమత స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆరో తరగతి చదువుతుండేది.

గుంతలో పడి వ్యక్తి..

కొత్తకోట రూరల్: ఫ్యాక్టరీలోని గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దమందడి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడ్డాకుల మండలం బలీదుపల్లికు చెందిన ఎర్రంశెట్టి బాలరాజుసాగర్(48) కొంత కాలంగా వెల్టూర్ సమీపంలో గల ఫాంఆయిల్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం నిచ్చెన జారి కింద పడటంతో ఫ్యాక్టరీలో గల ఖాళీగా ఉన్న గుంతలో పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన మూడావత్ సీతారాంనాయక్(55) చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాంనాయక్ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పంట చేలకు వేసే పురుగుల మందును తాగినట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మల్లిబాయి, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ వెంకటేష్ తెలిపారు.

బల్మూర్ మండలంలో మహిళ..

బల్మూర్:మండలంలోని పోలిశెట్టిపల్లికి చెందిన వస్కుల కృష్ణమ్మ(50) కడుపునొప్పి భరించలేక గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


50 గొర్రెలు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: టిప్పర్ ఢీ కొనడంతో 50 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని బొరాసిపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. మండలంలోని బొందలపల్లికి చెందిన కుర్వ ఆంజనేయులు తన గొర్రెలు మేత మేపిన అనంతరం తిరిగి వాటిని తీసుకువస్తు రోడ్డు దాటిస్తుండగా టిప్పర్ వేగంగా వచ్చి గొర్రెలను ఢీకొనడంతో గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల విలువ రూ.4లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

హార్ట్ భద్రం..!

కరోనాతో మరింత పెరుగుతున్న బాధితులు

- అలవాట్లు అదుపు చేసుకుంటేనే గుండెకు రక్ష
- జీవనశైలే ప్రధాన కారణం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న గుండెపోటు మరణాలు
- నేడు వరల్డ్ హార్ట్ డే



పాలమూరు: గతేడాది కాలం నుంచి జిల్లాలో గుండె మరణాలు అధికమైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఒకప్పుడు గుండెపోటు వయస్సుపైబడిన వారికి మాత్రమే వచ్చేది. ప్రస్తుత పరిస్థితుల్లో 16ఏళ్ల యువకుడి నుంచి 90ఏళ్ల వృద్ధుడి వరకు గుండెపోటు వస్తుంది. గుండెపోటుకు ప్రత్యక్ష కారణాలు పరిశీలన చేస్తే మానసిక ఒత్తిళ్ల వల్ల తీసుకునే ఆల్కహాల్ నుంచి ఆహారపు అలవాట్ల వరకు ఇవన్నీ గుండె పోటు రావడానికి దోహదం చేస్తాయి. రెండేళ్లుగా సహజంగా గుండెపోటు మరణాలు కాస్త పెరిగాయి. దీనికితోడు కరోనా మహమ్మారి వల్ల ఈ కేసులు రెట్టింపు అయ్యాయి. మన శరీరానికి పెద్ద దిక్కుగా వ్యవహరించే హృదయం లయ తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రధాన అవయవం గుండె..

మనిషి శరీరంలో పనిచేసే అవయవాలలో అతి ప్రధానమైంది గుండె. దీనికి ప్రస్తుత పరిస్థితిలో భద్రత లేకుండా పోతుంది. శారీరక వ్యాయామం లేకపోవడం, వేళాపాళా లేని భోజనాలు, పొగ తాగడం, ఒత్తిళ్ల చివరికి గుండెపోటులకు గురవ్వుతున్నారు. మనుషులలో మారుతున్న అలవాట్ల వల్ల ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలకు దారి తీయడంతో పాటు అంతిమంగా గుండెపై ఆ ప్రభావం పడుతోందని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రజల్లో పెరుగుతున్న ఊబకాయం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

జిల్లాలో 35శాతం బాధితులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో బాధపడే వారు 35శాతం ఉన్నట్లు అంచనా. వీరిలో మగవారు 22శాతం, మహిళలు 13 శాతం ఉన్నట్లు తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం, పట్టణాల్లో వీర సంఖ్య 56శాతం ఉంటుందని వైద్యాధికారులు తేల్చారు. ఆకస్మిక హృద్రోగ సమస్య ఎదురైన వారిలో 10శాతం మంది మాత్రమే చికిత్స తీసుకుని కోలుకుంటున్నారు.

తినకూడనివి	తినదగినవి
మటన్	చికెన్ (స్కిన్‌లెస్)
ఆయిల్‌ఫుడ్	గుడ్డు (తెల్లసోన)
అధిక ఉప్పు	కూరగాయలు (ఉడక పెట్టినవి)
పచ్చడి	పాలు (ప్యాకెట్‌వి మాత్రమే)
తంబాకు, గుట్కా, బ్రెడ్, బేకరీ ఫుడ్	



ఇలా చేస్తే మేలు..

- గుండెకు సంబంధించిన రోగాలు పెరుగుతున్న నేపథ్యంలో కష్టమైనా సరే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొని వాటిని తప్పక పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.
- రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కనీసం వారంలో ఐదు రోజులైనా వేగవంతమైన నడక, ఈత, స్కిప్పింగ్, షటిల్ లాంటి వ్యాయామాలు అవసరం. నిత్యం 45నిమిషాలపాటు నడిచినా సరిపోతుంది.
- నిత్యం వ్యాయామం చేస్తే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. తద్వారా ఒత్తిడి తగ్గడంతోపాటుగా మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు త్వరగా దరి చేరవు.
- ఎక్కువగా ఇంటి భోజనానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహారంలో గుడ్లు, పండ్లు, తాజా కాయకూరలు, ఆకుకూరలు, చేపలు ఉండేటట్లు చూసుకోవాలి.
- ధూమపానం, మద్యపానం అలవాట్లకు దూరంగా ఉండాలి.
- 30ఏళ్లు దాటిన తర్వాత ఏడాదికి రెండు, మూడు సార్లు రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి. ఈ రెండు వ్యాధుల్లో త్వరగా లక్షణాలు బయట పడవు. అందుకే నిశ్శబ్ద హంతకులుగా వ్యవహరిస్తాయి. ముందే అప్రమత్తంగా ఉండటం ద్వారా వీటి బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

మధుమేహంతో ముప్పు అధికం ..

రక్తపోటు, షుగర్ వ్యాధితో పాటు శరీర బరువుపై అదుపుకోల్పోవడం, వైద్య పరీక్షలకు నిర్లక్ష్యం చేయడం వల్ల గుండె సమస్యలకు ప్రధాన కారణం అవుతుంది. దీంతో పాటు మధుమేహం అధిక ముప్పుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సమస్య ఇంకా అధికమయ్యే ప్రమాదం ఉంది.

అలవాట్లు మార్చుకోవాలి..



ప్రతి ఒక్కరూ జీవనశైలితో పాటు ఆహార అలవాట్లు మార్చుకునే సమయం వచ్చింది. జిల్లాలో బీపీ బాధితులు పెరిగిపోతున్నారు. బీపీని ప్రాథమిక దశలో గుర్తించకపోతే ఇబ్బంది అవుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం చేయాలి. నిద్ర సక్రమంగా ఉండేవిధంగా చూసుకోవాలి. ఇటీవల ఆరోగ్య శాఖ నుంచి సీపీఆర్‌పై అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ, మహబూబ్‌నగర్

ఆరోగ్యంగా లేకపోవడం..



ఇటీవల ఫంక్షన్స్, డీజేల వద్ద డ్యాన్సులు చేస్తూ యువకులు గుండెపోటుతో చనిపోవడానికి కారణాలు ఉన్నాయి. అలాంటి వారు పూర్తిగా ఆరోగ్యంగా లేకపోవడం, సరైన సమయంలో ఆరోగ్య పరిస్థితి చూసుకోరు. ధూమపానం, మద్యం, మానసిక ఒత్తిడి పెరిగి జబ్బు పెరుగుతుంది. మా దగ్గరకు వస్తున్న వారిలో చాలా మంది హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించాం. 6నుంచి 7గంటల నిద్ర, రోజు గంట వ్యాయామం, సరైన ఆహారం, రోజుకు 3–4లీటర్ల నీరుతాగడం, ప్రశాంతమైన జీవనం సాగించడం చేయాలి.

– మహేష్‌బాబు, గుండె వైద్యనిపుణుడు, మహబూబ్‌నగర్

చిన్న వయస్సు వారే అధికం..



గుండెకు సంబంధించి గుండెపోటు ఒకటే సమస్య కాదు. లయబద్ధంగా కొట్టుకోకపోవడం, చిన్న వయస్సులో జనటిక్ సమస్యలతో గుండె బలహీనత పడటం అవుతుంది. కరోనా తర్వాత చిన్న వయస్సు కలిగిన వారిలో దాంట్లో పురుషులకు ఎక్కువగా గుండెపోటు వస్తోంది. క్రమం తప్పకుండా హార్ట్‌బీటింగ్, కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ చూసుకోవాలి. జిల్లాలో కోవిడ్ వైరస్ వల్ల 50నుంచి 60శాతం గుండె నొప్పి సమస్యలు పెరిగాయి. అధిక ఆయాసం, గుండెనొప్పి ఉంటే వెంటనే కార్డియాలజిస్ట్ దగ్గర చికిత్స తీసుకోవాలి. ఉద్యోగులు పనులు పూర్తి చేసుకొని ఇంటికి వచ్చి వ్యాయామం లేకుండా నిద్రపోవడం. ఈ క్రమంలో తెలియకుండానే కొవ్వు పెరిగి దాని వల్ల రక్తంలో బ్లాక్స్ ఏర్పాటు అవుతాయి. రక్త నాళాలపై కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె, మెదడు స్ట్రోక్ వస్తోంది. ఇలాంటి ఇన్సులెన్ తగ్గిపోయి డయాబెటిక్‌కు దారితీయడంతో పాటు శరీరం అధికంగా బరువు పెరుగుతుంది. 45నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. మసాలాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోరాదు. మాంసం వారానికి ఒక్కసారి మాత్రమే తీసుకోవాలి.

– స్వరూప్, జనరల్ ఫిజిషియన్, మహబూబ్‌నగర్

బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని కుమ్మెరలో పాలమూరు ఇరిగేషన్ పథకానికి భూమిచ్చి పరిహారం అందక ఆత్మహత్యకు పాల్పడిన రైతు అల్లోజి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పస్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం గ్రామానికి వెళ్లి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్లోజిది ఆత్మహత్య కాదని ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా చేనుతో సైతం రైతుల దగ్గర భూమిని గుంజుకొని రైతుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న అల్లోజి కుటుంబాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ పరామర్శించకపోవడం దుర్మార్గం అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి పోరాడతామని హామీ ఇచ్చారు. రైతు కోల్పోయిన భూమికి ఎకరాకు రూ.2లక్షల4వేలు తీసుకోవాలని బలవంత పెట్టారన్నారు. తాత ముత్తాతల నుంచి సంపాదించిన ఆస్తిపై హక్కు కలిగి ఉన్నప్పటికి భూమి వదులుకోవాలని భూమిలోకి వెళితే అక్కడే ఉన్న ప్రేమ్‌కుమార్‌తోపాటు మరికొందరు అవమానపరిచారని అన్నారు. ఇరిగేషన్ అధికారులు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి భూమిలోకి వెళ్లొద్దని అల్లోజిపై కేసు పెట్టారని, హెచ్చరించడం ఇవ్వడం వల్లే మనస్తాపానికి గురై అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆమె అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్ల వెంకటయ్య, కృష్ణా, బాలయ్య, ఖాజా, చెన్నయ్య, గౌరమ్మ, అల్లోజి కుటుంబ సభ్యులు లక్ష్మీదేవమ్మ, మైబూసు, అంజనమ్మ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు!

- డీఎస్సీ దరఖాస్తులకు ఆటంకం
- గురుకుల టీజీటీకి వెబ్ ఆప్షన్‌లకు 30వ తేదీ ఆఖరు
- ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు


తెలంగాణ చౌరస్తా వద్ద ఓ నెట్‌సెంటర్‌లో డీఎస్సీ సర్వర్ రాక నిరీక్షిస్తున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం అభ్యర్థులకు అవకాశం కల్పించింది. ప్రారంభం నుంచి దరఖాస్తుల స్వీకరణకు సర్వర్ సరిగ్గా పని చేయకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సార్లు ఫీజులు చెల్లించాక, మిగతా ప్రక్రియ కొనసాగలేదు. కొన్ని సార్లు ఫీజులు చెల్లించాక దరఖాస్తు ప్రక్రయ పూర్తయినట్లు, దరఖాస్తులు చేసుకున్నట్లు కన్‌ఫర్‌మేషన్ ఫారం డౌన్‌లోడ్ కావడం లేదు. ఇలా అనేక రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు వెబ్‌సైట్ అసలు ఓపెన్ కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో 35వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటితో పాటు గురుకుల టీజీటీ పోస్టులకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్‌లు ఇచ్చే ప్రక్రియ ఈనెల 30తో ముగియనుంది. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్లిన వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వెబ్‌సైట్ కూడా మొరాయిస్తుంది. కొన్ని సార్లు ప్రయత్నిస్తే ఓపెన్ అవుతుందని నెట్ సెంటర్‌ల వారు పేర్కొంటున్నారు. ఆప్షన్ల ప్రాధాన్యత క్రమంలో ఎలా ఇచ్చుకోవాలో అవగాహన లేక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రక్రియ గందరగోళంగా మారింది.

బాలుడి ప్రతిభకు సలాం

- ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు ప్రశంస



కందనూలు: బుడిబుడి అడుగులు వేసే వయస్సులో అక్షరాలు నేర్చుకుంటూ.. చూపించిన ప్రతి అక్షరాలను ఇట్టే గుర్తుపట్టి అందరిని ఆశ్చర్యపరుస్తున్నాడు. వివరాల్లోకి వెళితే నాగర్‌కర్నూలు మండలంలోని శ్రీపురం చెందిన దేవరపాగ చంద్రశేఖర్, రాజేశ్వరి దంపతుల కుమారుడు అభిజిత్ కుమారత (22 నెలలు) ఇంట్లోనే తల్లిదండ్రులు చెప్పే తెలుగు, ఇంగ్లిష్ పాదాలను పలుకుతూ చెప్పినవి, చెప్పినట్లు గుర్తుంచుకొని చెప్పడంతో తల్లిదండ్రులు, ఇతరుల సాయంతో చిన్నోడి మేధాశక్తిని గుర్తించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో దరఖాస్తు చేసుకున్నారు. చిన్నోడి మేధాశక్తిని ఫిదా అయిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు వారు ప్రశంస పత్రాలు, షీల్డ్‌లను పంపించారు. దీంతో అభిజిత్ మేధాశక్తికి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణకు వచ్చే అర్హత ప్రధానికి లేదు

- 'పాలమూరు'కు జాతీయ హోదా కల్పిస్తామని మరిచారు..
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: విశ్వగురుగా తనంతటతానుగా ప్రమోట్ చేసుకున్న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని మాట ఇచ్చిన మోడీ మాట తప్పారని, పాలమూరు గడ్డపై కాలు మోపే అర్హత లేదని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ నివాసంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. తొమ్మిదిన్నర ఏళ్లలో రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు చేపడుతుంటే బీజేపీకి చెందిన నేతలు కేసులు వేయడం, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వొద్దని ఉత్తరాలు రాసిన మాట వాస్తమా కాదా అని ప్రశ్నించారు. మళ్లీ ప్రాజెక్టుపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. ఓట్ల కోసమే తెలంగాణకు వస్తున్నారని, 2014 కంటే ముందు భూత్పూర్, మహబూబ్‌నగర్‌లో అనాటి బహిరంగ సభల్లో సుష్మాస్వరాజ్‌తో కలిసి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పిన మోడీ, ఎందుకు కల్పించలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకో జవహర్ నవోదయ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పట్టెం వద్ద మాత్రమే ఒకటి మాత్రమే నవోదయ పాఠశాల ఉందని, నాలుగు జిల్లాలో నాలుగు నవోదయ పాఠశాల, కళాశాల ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్నారు. రాష్ట్రంపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని, దేశంలో 130 మెడికల్ కళాశాలలను ఇచ్చిన కేంద్రం తెలంగాణకు ఒక్క మెడికల్ కళాశాల ఇవ్వలేదని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ అధినాయకత్వం రాష్ట్రంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సీఎం కేసీఆర్ ప్రజలకు పనులు బాగా చేస్తున్నారని కితాబు ఇచ్చారని, మున్సిపాలిటీలకు, గ్రామాలకు స్వయంగా కేంద్రం అవార్డులు ఇస్తే రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా మోడీ విమర్శించి వెళ్లడం సమంజసం కాదన్నారు.

భర్త అంత్యక్రియల్లో.. తనువు చాలించిన భార్య


డబ్బ లక్ష్మీరెడ్డి (ఫైల్)


డబ్బ శంకరమ్మ (ఫైల్)

శాంతినగర్: వారిద్దరూ అన్యోన్య దంపతులు. ఐదు దశాబ్దాలపాటు ఒకరినొకరు విడిచి ఉండలేదు. ఉన్న కొద్దిపాటి ఆదాయంతో సంతోషంగా కాలం గడిపేవారు. అకస్మాత్తుగా భర్త చనిపోవడంతో అంత్యక్రియలు నిర్వహిస్తూ భార్య కుప్పకూలి మృతిచెందిన ఘటన రాజోళి మండలంలోని పచ్చర్లలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పచ్చర్లకు చెందిన డబ్బ లక్ష్మీరెడ్డి (70) గద్వాల మండలం పాల్వాయి చెందిన శంకరమ్మతో 50 ఏళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ పోషణ కోసం గద్వాలకు మకాం మార్చారు. గద్వాలలోని హెడ్ పోస్టాఫీసు సమీపంలో భోజనం హోటల్ నిర్వహిస్తూ వచ్చే ఆదాయంతో కొడుకులు, కోడళ్లు, మనవళ్లు మనవరాళ్లతో కాలం గడుపుతున్నారు. సంతోషంగా జీవిస్తున్న వారి జీవితంలో పదేళ్ల క్రితం చిన్న కుమారుడు ఎల్లారెడ్డి అకస్మాత్తుగా మృతిచెందాడు. కోడలు, వారి పిల్లల బాధ్యతతో పాటు పెద్ద కుమారుడు, వారి కుటుంబభారం వీరిపై పడింది. అందరూ ఒక చోట ఉండటంతో ఎన్ని కష్టాలు వచ్చినా దిగమింగుతూ కాలం గడుపుతూ వచ్చారు. గురువారం తెల్లవారుజామున లక్ష్మీరెడ్డి అకస్మాత్తుగా మృతిచెందడంతో భార్య శంకరమ్మ ఎడబాటును భరించలేకపోయింది. ఉదయం నుంచి విలపిస్తూ కన్నీటి పర్యంతమైంది. స్వగ్రామమైన పచ్చర్లకు అంత్యక్రియలకోసం మృతదేహాన్ని తరలించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా భర్తకు మట్టి ఇస్తూ శంకరమ్మ(65) శ్మశానంలోనే కుప్పకూలి పడిపోయింది. చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలుకు తరలించారు. మార్గమధ్యంలో ఆమె తనువుచాలించింది. దీంతో బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. శంకరమ్మ మరణవార్త విని తల్లడిల్లిపోయారు. శుక్రవారం ఆమె అంత్యక్రియలు చేసి వెళ్తామని కుటుంబ సభ్యులు ఉండిపోయారు.

రాత్రి ఇంటి నుంచి వెళ్లి.. తెల్లారేసరికి ఆ ఇంట్లోనే శవమైన యువతి

బిజినేపల్లి: మండలంలోని పాలెం చెందిన లక్ష్మమ్మ (28) బుధవారం రాత్రి భోజనం చేసి ఇంటి నుంచి బయటికి వెళ్లి గురువారం తెల్లారేసరికి అదే ఇంట్లో శవమై కన్పించింది. ఈ ఘటన బిజినేపల్లి, పాలెం గ్రామాల మధ్య కోళ్ల ఫారాల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మమ్మ బిజినేపల్లి శివారులోని పాలెం కోళ్లఫారాల వద్ద ఉన్న అమ్మమ్మ ఇంట్లో ఉంటుంది. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన లక్ష్మమ్మ బయటికి వెళ్తానని చెప్పింది. తీరా గురువారం తెల్లవారుజామున లేచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకోవడం చూసి చుట్టుపక్కల వారి సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మమ్మ ఒంటిపై కొన్ని గాయాలు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. రాత్రి వేళలో గుర్తు తెలియని దుండగులు లైంగికదాడికి పాల్పడి హతమార్చి ఉండొచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గురువారం సాయంత్రం నాటికి బంధువుల వద్ద నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాములుయాదవ్ తెలిపారు. కొన్నేళ్ల కిందటనే లక్ష్మమ్మ భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని స్థానికులు తెలిపారు.

ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి


దిగువ జూరాలలోని పవర్‌హౌజ్ కేంద్రం

ధరూరు/ఆత్మకూరు: జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 20,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 118, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 450, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 26,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. గురువారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 3 యూనిట్ల ద్వారా 117 మెగావాట్లు, 94.510 ఎం.యూ., దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, 102.354 ఎం.యూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 196.864 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని పేర్కొన్నారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం వెయ్యి క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కోయిల్‌సాగర్‌లో 31.3 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో గురువారం సాయంత్రం వరకు 31.3 అడుగుల నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా, మరో 1.3 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది. రెండో విడత విరామం తర్వాత వానాకాలం పంటలకు శుక్రవారం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు గురువారం ఇన్‌ఫ్లో పెరిగింది. బుధవారం 6వేల క్యూసెక్కులు రాగా, గురువారం కొంత మేర పెరిగింది. డ్యాంకు ఎగువన కురుస్తున్న వర్షాలు, వాగుల నీటితో డ్యాంకు ఇన్‌ఫ్లో వచ్చినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,450 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటును తెరిచి 6,710 క్యూసెక్కులు దిగువన ఉన్న శ్రీశైలంకు వదిలి కేసీ కెనాల్‌కు 1,616 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ తెలిపారు.

శ్రీశైలంలో 854.9 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 854.9 అడుగుల వద్ద 91.6 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 23,303, సుంకేసుల నుంచి 6,710 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,437, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450, రేగుమాన్‌గడ్డ నుంచి 1,764 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 3.762 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 7,357 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

అర్థ్రైటిస్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ కేజే.రెడ్డి

- అక్టోబర్ 5 నుంచి 12 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఎస్‌వీఎస్ ఎండీ డాక్టర్ కేజే.రెడ్డి

పాలమూరు: ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అక్టోబర్ 5 నుంచి 12వరకు ప్రపంచ అర్థ్రైటిస్ వేడుకలు నిర్వహిస్తున్నామని ఎండీ డాక్టర్ కేజే.రెడ్డి వెల్లడించారు. ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ప్రజల కోసం అర్థ్రైటిస్‌పై అవగాహన కల్పించే క్రమంలో రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు ఉచితంగా తీయడంతో పాటు తక్కువ ఖర్చుతో చికిత్స, స్క్రీనింగ్, డయోగ్నోస్టిక్స్ మందులు అందజేస్తామన్నారు. ఈ నెల 12న ఎస్‌వీఎస్‌లో 10లైవ్ నీ–జాయింట్స్ సర్జరీలు చేస్తామని దీనికి జాతీయ స్థాయిలో వైద్యులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోగులతో పాటు కొత్త సర్జన్‌లకు ఉంతో ఉపయోగపడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 7కోట్ల మంది ఈ అర్థ్రైటిస్ సమస్య బాధపడుతున్నారని, ఉమ్మడి జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా ఈ సమస్య కలిగి ఉంటారన్నారు. వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేక, నడవలేక ఇబ్బంది పడుతున్నారని, చికిత్సతో సమస్యకు పరిష్కారం చూపవచ్చునని తెలిపారు. అర్థ్రైటిస్ సమస్య ఉన్న వారికి రోజు నడక చాలా ముఖ్యమన్నారు. గతేడాది ఎస్‌వీఎస్ దాదాపు 200సర్జరీలు చేశామని, ఈ సర్జరీలు చేయడానికి ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు, థియేటర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో ఎస్‌వీఎస్‌లో రోబోటిక్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తామని, తక్కువ ఖర్చుతో జిల్లా వాసులకు వైద్యం అందిస్తామన్నారు. ప్లాస్మా థెరపీ సైతం కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, బీఎస్ రవి, డాక్టర్ జయరాంరెడ్డి పాల్గొన్నారు.